TGTEL/26/A6780

స్పందన

తెలుగు దినపత్రిక

సంపుటి :01 | సంచిక :09 | పేజీలు 8 వెల : 5 | ఆదివారం 20 సెప్టెంబర్ 2026

మజ్లిస్ దోస్తీ.. కాంగ్రెస్ స్కెచ్చా..?

దానం ఔట్..? సుప్రీంకోర్టులో బిగ్ ఫైట్!

హైదరాబాద్, సెప్టెంబర్ 19

:ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్ అయింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ శనివారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2023లో బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

10వ షెడ్యూల్ ప్రకారం 2024 ఏప్రిల్ 23 నుంచే దానం అనర్హుడని హైకోర్టు తీర్పునిచ్చింది. స్టేకు హైకోర్టు నిరాకరించడంతో దానం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో అత్యవసర ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని, ఖైరతాబాద్ సీటును ఖాళీగా ప్రకటించొద్దని కోరారు. సోమవారం పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉండటంతో తెలంగాణ పాలిటిక్స్‌లో ఉత్కంఠ నెలకొంది.

నీళ్లు పక్కనే.. మన వాటా ఎక్కడే?

కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ఫెయిల్.. హరీశ్ రావు ఫైర్!

హైదరాబాద్, సెప్టెంబర్ 19:

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా వాడుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లలో ఏపీ 718 టీఎంసీలు వాడుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలు మాత్రమే వినియోగించుకుందన్నారు. 2025-26లో మన వాటాలో కేవలం 25 శాతం నీళ్లే వాడుకున్నారని విమర్శించారు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నా.. మోటార్లు సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం ఎత్తిపోసే విషయంలో జాప్యం చేస్తోందన్నారు. కల్వకుర్తికి ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారని, వెల్లూరులో 5 మోటార్లకు 2 మాత్రమే నడుస్తున్నాయని చెప్పారు. మరోవైపు ఏపీ పోతిరెడ్డిపాడు, వెలిగొండకు నీళ్లు తరలించుకుపోతోందన్నారు. "ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు" అంటూ హరీశ్ రావు మండిపడ్డారు.

మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు జోష్..

ఇక వరంగల్ టు వరల్డ్ ఫ్లైట్!

హైదరాబాద్, సెప్టెంబర్ 19:

వరంగల్ మామునూరు విమానాశ్రయం కల సాకారమయ్యే దిశగా పనులు జోరందుకున్నయ్. అనుమతులు, భూసేకరణ, టెక్నికల్ సర్వేలు దాటేసి.. నిర్మాణ పనులను 3 ప్యాకేజీల్లో చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. ఇప్పటికే రెండు ప్యాకేజీల టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది.కొత్త ఎయిర్‌పోర్ట్‌కు ఏ పేరు పెడితే బాగుంటదో ప్రజలు సూచించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భూసేకరణ కోసం రాష్ట్ర సర్కారు రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని ఏఏఐకి అప్పగించిందని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కేవలం విమానాల రాకపోకలకే పరిమితం కాదని.. ఇండస్ట్రీలు, టూరిజం, ఎడ్యుకేషన్, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వేలిలిగా మారుతుందని సీఎం పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎయిర్‌పోర్ట్ కల నెరవేరలేదంటూ రేవంత్ విమర్శలు చేశారు.

జన్వాడ ఫాంహౌస్ ముట్టడి

అనుమతులు లేవు, ఫిరంగి నాలా ఆక్రమణ..
కేటీఆర్ బాగోతాన్ని బయటపెడతాం

111 జీవో లో అక్రమ నిర్మాణం

ఆ భూములన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

ఫామ్ హౌస్ అసలు ఓనర్ ఎవరో తేలాలి

ఎంపీలు మల్లు రవి,చామల కిరణ్ కుమార్ రెడ్డి,

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే

- కోదాడ సభలో ప్రకటనకు మార్మోగిన హర్షధ్వానాలు
- మన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించడాన్ని మించిన ఆనందం లేదు
- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగం వచ్చే వరకు అండగా ఉంటాం
- కోదాడలో త్వరలో 'టాస్క్' కేంద్రం: మంత్రి శ్రీధర్‌బాబు
- 350 కంపెనీల ద్వారా 5,725 మంది అభ్యర్థుల ఎంపిక

"పాఠశాలలు, కళాశాలలు నిర్మిస్తాం.. రహదారులు వేస్తాం.. ఎత్తిపోతల పథకాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తాం. కానీ మన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించినప్పుడు కలిగే ఆనందం వీటన్నింటికంటే గొప్పది" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

ప్రకృతి దోస్తీ.. ప్రగతి దూకుడు!

పర్యావరణాన్ని కాపాడుకుంటూనే ఆర్థికంగా దూసుకెళ్లడంలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతూ.. పునరుత్పాదక ఇంధనం, క్లీన్ ట్రాన్స్‌పోర్ట్, నీటి సంరక్షణలో దేశం వేగంగా ముందుకెళ్తోందన్నారు. 12 ఏళ్ల క్రితం కేవలం 2 గిగావాట్లుగా ఉన్న సోలార్ సామర్థ్యం ఇప్పుడు 160 గిగావాట్లకు పైగా పెరిగిందన్నారు.

హైదరాబాద్‌కు వాన గండం.. బయటకొస్తే తడిసి ముద్దే!

సిటీలో వర్షం మళ్లీ దంచికొట్టే ఛాన్స్ ఉందంటూ తెలంగాణ వెదర్ మ్యాన్ బాలాజీ బిగ్ అలర్ట్ ఇచ్చారు. ఈస్ట్, సౌత్, సెంట్రల్ హైదరాబాద్‌లో రానున్న రెండు గంటల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వీలైనంత వరకు బయటకు రావొద్దని సూచించారు.నాగోల్‌లో ఇప్పటికే భారీ వర్షం కురుస్తుండగా.. వినాయక నిమజ్జనాలకు బయల్దేరిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. లోయర్ ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, బోయిగూడ ప్రాంతాల్లో మధ్యాహ్నం చిరుజల్లులు కురిశాయి. అటు రంగారెడ్డి, సూర్యాపేట, జగిత్యాల, వికారాబాద్ జిల్లాల్లోనూ వానలు దంచికొట్టాయి. నిమజ్జనాల వేళ వాన, ట్రాఫిక్.. భక్తులకు డబుల్ టెన్షన్!

దానం అనర్హతపై.. స్పీకర్ సైలెంట్!

హైకోర్టు తీర్పు తర్వాత ఖైరతాబాద్‌లో బైపోల్ హీట్..

హైదరాబాద్, సెప్టెంబర్ 19

: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంతో తెలంగాణ పాలిటిక్స్‌లో టెన్షన్ పెరిగింది. హైకోర్టు తీర్పుపై స్పందించాలంటూ మీడియా ప్రశ్నించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాత్రం నో కామెంట్ అంటూ సైలెంట్‌గా వెళ్లిపోయారు. శనివారం కోదాడలో మెగా జాబ్ మేళాకు హాజరైన ఆయన.. దానం అనర్హత పిటిషన్లపై ఎలాంటి కామెంట్ చేయలేదు. మరోవైపు దానం నాగేందర్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని క్లారిటీ ఇచ్చారు. ఒకవేళ ఉపఎన్నిక వస్తే పోటీకి రెడీగా ఉన్నానని చెప్పారు. దీంతో ఖైరతాబాద్‌లో బైపోల్ హీట్ ఒక్కసారిగా పెరిగింది. స్పీకర్ నిర్ణయం, కాంగ్రెస్ తదుపరి వ్యూహంపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

స్పందన తెలుగు దినపత్రిక

పశువుల దొంగతనాలు, మొబైల్ షాపుల్లో చోరీలు చేసే
అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

తెలంగాణ, మధ్యప్రదేశ్‌లలో వరుస చోరీలకు పాల్పడిన ముఠా

చోరీ మొబైళ్లను ముంబయి మీదుగా బంగ్లాదేశ్‌కు తరలిస్తున్న అంతర్జాతీయ నెట్‌వర్క్ బట్టబయలు

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసు, ఖమ్మం పోలీసుల సంయుక్త ఆపరేషన్.. . 17 కేసులు ఛేదన, రూ. 22 లక్షల సొత్తు స్వాధీనం,

3 కార్లు, 15 మొబైల్ ఫోన్లు స్వాధీనం, 9 మంది నిందితుల అరెస్ట్,3 పరారీలో ఉన్నారు.

పశువులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి అపహరించడంతో పాటు అర్ధరాత్రి వేళల్లో సెల్ ఫోన్ దుకాణాల షట్టర్లు లేపి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను, చోరీ సొత్తును కొనుగోలు చేస్తూ బంగ్లాదేశ్‌కు అక్రమ రవాణా చేస్తున్న అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో చాకచక్యంగా పట్టుకున్నారు.నిందితులు తెలంగాణ వ్యాప్తంగా 13 పశువుల దొంగతనాల కేసుల్లోనూ, ఖమ్మం, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో మొబైల్ దుకాణాల చోరీ కేసుల్లోనూ ప్రమేయం కలిగి ఉన్నారు. చోరీ చేసిన మొబైల్ ఫోన్లను ముంబయి, బంగ్లాదేశ్ వరకు విస్తరించిన వ్యవస్థీకృత నెట్‌వర్క్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో చోరీ సొత్తు విక్రయించగా వచ్చిన నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితుల వివరాలు:

పశువుల దొంగతనాల నిందితులు

1. మహ్మద్ తబ్రేజ్, తండ్రి: దివంగత దావూద్ షేక్, వయస్సు: 40 సం., వృత్తి: డ్రైవర్, నివాసం: తాలబ్ మసీదు, మోతీ దర్వాజా, లంగర్‌హౌస్, హైదరాబాద్. (రెండు నేరాల్లోనూ నిందితుడు)
2. మహ్మద్ రఫీక్, తండ్రి: అబ్దుల్ నబీ, వయస్సు: 54 సం., వృత్తి: ఆటో డ్రైవర్, నివాసం: గార్డెన్ సమీపంలో, గోల్కొండ ఖిల్లా, హైదరాబాద్. (రెండు నేరాల్లోనూ నిందితుడు)
3. మహ్మద్ జుబేర్ అక్తర్, తండ్రి: దివంగత మహ్మద్ అక్తర్ అలీ, వయస్సు: 30 సం., వృత్తి: హార్స్ రైడింగ్, నివాసం: ఆల్ఫా హాస్పిటల్ ఎదురుగా, మొఘల్‌పురా, హైదరాబాద్.
4. మహ్మద్ నవీద్, తండ్రి: మహ్మద్ మహబూబ్, వయస్సు: 24 సం., వృత్తి: కసాయి పని (బుచర్), నివాసం: అన్వర్ మసీదు సమీపంలో, నజం నగర్, కిషన్‌బాగ్, హైదరాబాద్.
5. పి. సాయిరెడ్డి, తండ్రి: దివంగత పి. పాండురంగారెడ్డి, వయస్సు: 35 సం., వృత్తి: మెడికల్ షాప్ వర్కర్, నివాసం: లంగర్‌హౌస్, హైదరాబాద్. (జైలాజిన్ ఇంజెక్షన్ల సరఫరాదారుడు)

సెల్ ఫోన్ దుకాణాల్లో షట్టర్లు లేపి చోరీలకు పాల్పడిన నిందితులు:

6 ఫరహాన్ షేక్, తండ్రి: ముంతాజ్ షేక్, వయస్సు: 37 సం., వృత్తి: కూలీ, నివాసం: ముంబయి, మహారాష్ట్ర.
7. ముబీన్ షేక్, తండ్రి: హసన్ షేక్, వయస్సు: 45 సం., వృత్తి: స్విచ్చింగ్, నివాసం: ముంబయి, మహారాష్ట్ర. (రిసీవర్)
8. మెహబూబ్ షేక్ అలియాస్ పాపా, తండ్రి: అబ్దుల్ ఫజల్ షేక్, వయస్సు: 32 సం., వృత్తి: కార్ డ్రైవర్, నివాసం: కుర్లా వెస్ట్, ముంబయి, మహారాష్ట్ర. (రిసీవర్)
9 మహ్మద్ జాహెద్ ఖాన్ అలియాస్ రాజా భాయ్, తండ్రి: దివంగత మహ్మద్ అహ్మద్, వయస్సు: 34 సం., వృత్తి: వ్యాపారం, నివాసం: నవీ ముంబయి, మహారాష్ట్ర. (రిసీవర్)
10. అబూ అలియాస్ అఫ్జల్ --- పరారీలో ఉన్నాడు (అబ్స్కాండింగ్)11. కాలు (నివాసం: ముంబయి) --- పరారీలో ఉన్నాడు (అబ్స్కాండింగ్)
11. ఖాసిమ్ (నివాసం: ఢాకా, బంగ్లాదేశ్) --- పరారీలో ఉన్నాడు (అబ్స్కాండింగ్)

స్వాధీనం చేసుకున్న సొత్తు (SEIZED PROPERTY):

1. మొబైల్ ఫోన్లు -- 15
2. నాలుగు చక్రాల కార్లు -- 03
3. నగదు -- రూ. 22,00,000/-
4. నంబర్ ప్లేట్ -- 01

నేర విధానం -- పశువుల దొంగతనాలు

విచారణలో మహ్మద్ తబ్రేజ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. పశువులకు గిరాకీ ఎక్కువగా ఉండే రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో అతడు, మహ్మద్ రఫీక్ మరియు వారి సహచరులు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. అర్ధరాత్రి వేళల్లో నిర్మానుష్య ప్రాంతాల్లోని పశువుల పాకలను తబ్రేజ్, రఫీక్‌లు గుర్తించేవారు. పశువులు అరువకుండా, మగతగా ఉండేందుకు వాటికి శఎశ్రీఖఓఅఅవ అనే మత్తు ఇంజెక్షన్ ఇచ్చేవారు. అనంతరం వాటిని వాహనాల్లోకి ఎక్కించి తరలించేవారు. దొంగిలించిన పశువులను సంతల్లో తక్కువ ధరకు విక్రయించేవారు. తబ్రేజ్‌కు గతంలోనూ తాళాలు పగలగొట్టడం, షట్టర్లు లేపి చోరీలు చేసిన కేసులు ఉన్నాయి. పశువుల దొంగతనాల తర్వాత అతడు తిరిగి తన పాత పద్ధతిలోనే వ్యాపార సంస్థలను, ముఖ్యంగా మొబైల్ ఫోన్ దుకాణాల షట్టర్లు లేపి చోరీలు చేయడం ప్రారంభించాడు.

ఉడాన్' ద్వారా యువతకు సాంకేతిక నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు

టాస్క్ (TASK) -- డెల్ టెక్నాలజీస్ ఒప్పందం । 5,500 మంది విద్యార్థులకు శిక్షణ । 25 శిక్షణా కేంద్రాలు

హైదరాబాద్: తెలంగాణ యువతను నూతన సాంకేతిక రంగాల్లో తీర్చిదిద్ది, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), ప్రముఖ దిగ్గజ సంస్థ 'డెల్ టెక్నాలజీస్' చేతులు కలిపాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో 'ఉడాన్' (uDaan) కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఇరు పక్షాల ఒప్పందం (MoU) కుదుర్చుకున్నాయి.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నాయకత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ అవగాహన ఒప్పందం ఖరారైంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రంగానికి చెందిన ఉన్నతాధికారులు, టాస్క్ ప్రతినిధులు, డెల్ టెక్నాలజీస్ బాధ్యులు మరియు భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 5,500 మంది విద్యార్థులకు శిక్షణ

ఉడాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే 25 శిక్షణా కేంద్రాల ద్వారా 5,500 మంది విద్యార్థులకు 3 నెలల పాటు ప్రత్యేక్షానుభవంతో కూడిన శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), క్లౌడ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, నూతన సాంకేతికతలు, డిజిటల్ నైపుణ్యాలతో పాటు పారిశ్రామిక అవగాహన, ఉద్యోగార్హత ప్రతిభ పెంచేలా ఈ శిక్షణ సాగనుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు సైతం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

చదువు నుంచి పరిశ్రమ వైపు.. నైపుణ్యం నుంచి ఉపాధి వైపుకేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా సమగ్రమైన ఒక సత్ఫలితాన్ని సాధించడమే ఉడాన్ ముఖ్య ఉద్దేశం:

విద్య ? నైపుణ్య శిక్షణ ? పారిశ్రామిక అవగాహన ? ఉపాధి / అప్రెంటిస్‌షిప్ / పారిశ్రామికవేత్తగా రాణించడం

డిగ్రీలు పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, చదువుకుంటున్న సమయంలోనే పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా యువతకు ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్‌లు లేదా స్వయం ఉపాధి దిశగా మార్గం సుగమం చేయడం ఈ ఉడాన్ ప్రధాన లక్ష్యం.

ఐబిటీ ఢిల్లీ కరికులం.. డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారంఐబిటీ ఢిల్లీ రూపొందించిన పాఠ్యాంశాల (Curriculum) ఆధారంగా, డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారంతో ఈ శిక్షణ సాగుతుంది.

జాతీయ స్థాయిలో డెల్ టెక్నాలజీస్, ఎఫ్.ఐ.టి.టి (FITT)-- ఐబిటీ ఢిల్లీ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, జనరేషన్ ఇండియా ఫౌండేషన్‌లు కలిసి ఉడాన్ ద్వారా యువతకు భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నాయి.

రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు చొరవ, మార్గదర్శకత్వంతో ముందుకు సాగుతున్న ఈ బృహత్ కార్యక్రమం.. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువత సరికొత్త టెక్నాలజీలపై పట్టు సాధించేందుకు అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది. కేవలం శిక్షణ సంఖ్యకే పరిమితం కాకుండా, యువతకు స్పష్టమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సమర్థవంతమైన స్కిల్లింగ్ వ్యవస్థను నిర్మించాలనే టాస్క్ లక్ష్యానికి ఈ భాగస్వామ్యం మరింత బలాన్ని చేకూరుస్తోంది.

ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి (IAS), స్టేట్ కౌన్సిల్ సెక్రటరీ రామ్, టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డి, సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సీఓఓ నిఖిల్, డెల్ టెక్నాలజీస్ గవర్నమెంట్ సీనియర్ అకౌంట్ మేనేజర్ కె. కృష్ణ కిషోర్, డెల్ టెక్నాలజీస్ ఏపీజేసీ రీజనల్ సీఐఓ ఎ హైదరాబాద్ సైట్ డైరెక్టర్ రమేష్ జంపుల తదితరులు పాల్గొన్నారు."నైపుణ్యం నుంచి అవకాశాల వైపు --- రేపటి సాంకేతిక ప్రపంచానికి, ఉపాధి సవాళ్లకు తెలంగాణ యువతను సంపూర్ణంగా సిద్ధం చేయడమే టాస్క్-డెల్ 'ఉడాన్' ముఖ్య ఉద్దేశం

తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి ఉత్తమ్

కోదాడ/హైదరాబాద్, సెప్టెంబర్ 19:

తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కోదాడలో శనివారం నిర్వహించిన భారీ మెగా జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ ఈ ప్రకటన చేయగానే సభా ప్రాంగణం హర్షధ్వానాలతో మార్మోగింది.గత లోక్‌సభ ఎన్నికల్లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు లభించిన భారీ ఆధిక్యమే ఈ ప్రాంతంలో పార్టీకి ఉన్న ప్రజాబలానికి నిదర్శనమని ఉత్తమ్ పేర్కొన్నారు. లక్షకు పైగా మెజారిటీ సాధించడంలో ఈ రెండు నియోజకవర్గాలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ఏర్పడుతుందని స్పష్టం చేశారు.

అనంతరం మెగా జాబ్‌మేళా ప్రాముఖ్యతను వివరిస్తూ, గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలను నేరుగా అందుబాటులోకి తీసుకురావడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు."పాఠశాలలు, కళాశాలలు నిర్మిస్తాం.. రహదారులు వేస్తాం.. ఎత్తిపోతల పథకాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తాం. కానీ మన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించినప్పుడు కలిగే ఆనందం వీటన్నింటికంటే "గొప్పది" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.మెగా జాబ్‌మేళాకు దాదాపు 365 కంపెనీలను ఆహ్వానించగా, సుమారు 350 కంపెనీలు స్పందించి కోదాడకు వచ్చాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఐఫోన్లను తయారు చేసే తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ వంటి బహుళజాతి సంస్థలు హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వాటికి పెద్ద సంఖ్యలో ఇంజినీర్ల అవసరమవుతున్నారని చెప్పారు. అయితే కోదాడ, హుజూర్‌నగర్, నడిగూడెం, మునగాల వంటి ప్రాంతాలకు చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రులు ఆ సంస్థలను నేరుగా సంప్రదించే అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు."మన యువత కంపెనీల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉంటే, కంపెనీలనే యువత వద్దకు తీసుకురావాలి. యువత, పరిశ్రమల మధ్య నేరుగా అనుసంధానం కల్పించాలనే ఆలోచనతోనే ఈ మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశాం" అని ఉత్తమ్ తెలిపారు.తాను, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి దశాబ్దాలుగా ఏర్పరచుకున్న పరిచయాలను ఉపయోగించి వివిధ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడామని చెప్పారు. పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్‌తో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలు కూడా కంపెనీలను కోదాడకు తీసుకురావడంలో సహకరించాయని వివరించారు.హైదరాబాద్‌కు దూరంగా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు సమీపంలో ఉన్న కోదాడకు వందలాది కంపెనీలను రప్పించడం సాధారణ విషయం కాదన్నారు. వరంగల్, నల్గొండ జిల్లాలతో పాటు ఖమ్మం ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఈ అవకాశంపై అవగాహన కల్పించేందుకు పత్రికలు, టెలివిజన్, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించామని చెప్పారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం క్యూఆర్ కోడ్‌లను పెద్ద ఎత్తున అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

జాబ్‌మేళా విజయవంతానికి కృషి చేసిన సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ, పరిశ్రమల శాఖ, సింగరేణి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంతోనే తమ బాధ్యత ముగిసిపోదని ఉత్తమ్ స్పష్టం చేశారు. "ఇక్కడ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నా కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలి. ఈరోజే ఉద్యోగం వచ్చినా, పరిశీలించి తరువాత అవకాశం కల్పిస్తామని కంపెనీ చెప్పినా మేము ఫాలోఅప్ చేస్తాం. యువతకు ఉద్యోగం లభించే వరకు అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు.కోదాడతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ఉత్తమ్, 32 సంవత్సరాల క్రితం 1994లో తొలిసారిగా ఇక్కడి నుంచే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినట్లు తెలిపారు.కోదాడలో త్వరలో 'టాస్క్' కేంద్రం

కోదాడలో త్వరలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్---'టాస్క్' కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. స్థానిక యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం లక్ష్యమని తెలిపారు.

మెగా జాబ్‌మేళాలో మాట్లాడిన శ్రీధర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

జాబ్‌మేళాలో పాల్గొన్న 350కి పైగా కంపెనీలు దాదాపు 5,725 మంది అభ్యర్థులను ప్రాథమికంగా ఎంపిక చేయడం గొప్ప విజయమని శ్రీధర్‌బాబు అభినందించారు. ఈ భారీ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన అధికారులు నిరంతరం శ్రమించిన అధికారులు, కంపెనీల ప్రతినిధులు, సుమారు 700 మంది వాలంటీర్ల సేవలను ప్రశంసించారు.

ప్రభుత్వం ఒక్కటే ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని, ప్రైవేటు రంగం కూడా ముందుకొచ్చి ఉపాధి అవకాశాల కల్పనలో కీలక పాత్ర పోషించాలని కోరారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, డిప్లొమా, ఐటీఐ, ఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన యువతకు పరిశ్రమలు విస్తృత అవకాశాలు కల్పించాలన్నారు.వందలాది కంపెనీలను గ్రామీణ యువత వద్దకు తీసుకొచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనేలా ఉత్తమ్ వ్యక్తిగతంగా పలుమార్లు సంప్రదింపులు జరిపారని చెప్పారు.ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి విజ్ఞప్తి మేరకు కోదాడలో వీలైనంత త్వరగా 'టాస్క్' కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించే ప్రధాన వేదికగా మారడంతోపాటు వారిని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతుందని తెలిపారు.ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న యువత వాటిని తమ జీవిత ప్రయాణంలో తొలి అడుగుగా భావించాలని శ్రీధర్‌బాబు సూచించారు. నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ కష్టపడి పనిచేయాలని కోరారు. ప్రస్తుతం ఉద్యోగాలు పొందిన వారిలో కొందరు భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదిగి, తిరిగి కోదాడకు వచ్చి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

22ఎ సమస్యలకు త్వరలో ముగింపు

12 అంశాలలో ఇప్పటికే 2 అంశాలకు జీవో జారీ

మరికొన్ని అంశాలపై తీపికబురు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ :- రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు శాసనసభలో చేసిన ప్రకటన మేరకు త్వరలో ప్రజలకు తీపికబురు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. దీనిలో భాగంగా అసెంబ్లీలో ప్రకటించిన 12 అంశాలపై దృష్టి సారించి దశల వారీగా వాటిని పరిష్కరిస్తున్నామని ఈ మేరకు కాలనీల సమస్యపై జీవో 118, సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను విడుదల చేశామన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించి సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ధృవ పత్రాలను సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆలోచనల మేరకు ఈ క్యూర్ ప్రాంతాన్ని ప్రపంచంలోనే నెంబర్ 1 ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సమస్యల పరిష్కారానికి గాను ఆధార్ వలె భూధార్ కార్డులు ఇస్తామని, ఈ క్యూర్ ప్రాంతంలో కూడా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాల ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వలేమని తమకు ప్రజాసేవే ముఖ్యమని అన్నారు. ఇటీవల శాసనసభలో భూ సమస్యలపై సుదీర్ఘంగా చెప్పామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనలు, 12 అంశాల మేరకు ఈ సరూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న 64 కాలనీల్లోని 44 కాలనీల సమస్యను పరిష్కరించామని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు 118 జీఓ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన హామీని ఈరోజు నిలబెట్టుకున్నామన్నారు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీవారు ప్రాతినిధ్యం వహిస్తున్నా తామూ బేషజాలకు పోకుండా ఇక్కడి 44 కాలనీల సమస్యపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులున్న ఇప్పుడు వాటిని నెలరోజులలోగా పరిష్కరించి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఎవరి ఇళ్లకూల్చడని స్పష్టం చేశారు.జీవో 118 సహకారంతో మేడ్చల్ , రంగారెడ్డి జిల్లాలోని మరికొంత మందికి కూడా నెలలోగా సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ ప్రాంత కాలనీలు చాలా కాలం నుంచి 22ఎలో ఉన్నాయని వివరిస్తూ 22ఎ కు సంబంధించి త్వరలో ఈ ప్రభుత్వం తీపి కబురు చెప్పనుందని తెలిపారు. 22ఎ అనేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి అమలులో ఉందని, దీనిని పరిశీలించుకోవచ్చునన్నారు. అయితే కొంతమంది

దీనిని అసరాగా చేసుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మరో వారం రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా ప్రభుత్వ ఆదేశాలు రానున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ సమస్య, దరఖాస్తు చేసుకొని వారి సమస్యను పరిష్కరించేందుకు ఈ వేదికగా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు త్వరలో ఈ మేరకు శుభవార్త చెబుతారని ప్రకటించారు. సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను అమలు చేయబోతున్నామని దీనికోసం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మరో 45 రోజుల్లో పూర్తిస్థాయిలో భూసమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎల్. బి. నగర్, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు డి .సుధీర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, ఎల్. బి. నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

జన్వాడ ఫాంహౌస్ ముట్టడి

రంగారెడ్డి/మణికొండ, సెప్టెంబర్ 19 :

రంగారెడ్డి జిల్లా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వివాదాస్పద జన్వాడ ఫాంహౌస్ కేటీఆర్ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఎటువంటి అనుమతులు లేకుండా, జీవో 111 నిబంధనలను ఉల్లంఘిస్తూ ఫిరంగి నాలాను ఆక్రమించి ఈ ఫాంహౌస్‌ను నిర్మించారని, ఈ అంశంపై జూలై నెలలో 'హైడ్రా' నోటీసులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు. శనివారం ప్రజాపవన్ నుంచి కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేల రాజేంద్ర రెడ్డి, నవీన్ యాదవ్ బృందం ప్రత్యేక బస్సులో జన్వాడ ఫాంహౌస్ పరిశీలనకు బయలుదేరింది. అయితే, ఫాంహౌస్ వద్ద "నో ట్రెస్పాస్" (అనుమతి లేనిదే ప్రవేశం లేదు) బోర్డు ఉండటంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో నేతలు లోపలికి వెళ్లకుండానే, వెలుపల ఉన్న ఫిరంగి నాలాతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించి వెనుదిరిగారు.

భూమి బదిలీపై సంచలన ఆరోపణలు- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అక్కడే మీడియాతో మాట్లాడుతూ జన్వాడ ఫాంహౌస్ భూముల వెనుక పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. ఈ భూములన్నీ

నత్యం కంపెనీ భూములు అని, సత్యం రామలింగరాజుకు చెందిన శశిషిత కంపెనీ భూముల్లోనే ఈ ఫాంహౌస్ నిర్మించారు. ప్రజలను మోసం చేసిన కేసులో ఈడీ ఈ కంపెనీ ఆస్తులు, షేర్లను అటాచ్ చేసి బ్లాక్ లిస్టులో పెట్టిందని చెప్పారు. మొత్తం 13 ఎకరాల భూమి మార్పులు చేర్పుల పై విచారణ జరిపి అనుమానాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కేసు ఐటీ ట్రిబ్యునల్ కోర్టులో ఉండగా, జన్వాడలోని సర్వే నంబర్లు 301, 311, 313లోని 13 ఎకరాల భూమిని మాత్రం 2014-15లో అనుహ్యంగా రిలీజ్ చేశారని తెలిపారు.

ఆ భూమి

నేరుగా ప్రముఖుల

'పెద్ద మీదకి రాకుండా ముందుగా 'డీఎస్పీ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ కంపెనీకి, ఆ తర్వాత సత్యం రామలింగరాజు కుమారుడి సన్నిహితుడైన డి. రాజేశ్‌కు, అతని నుంచి ప్రదీప్ రెడ్డికి బదిలీ అయిందని వివరించారు. ప్రదీప్ రెడ్డి ఈ భూమిని కేటీఆర్‌కు లీజుకు ఇచ్చానని చెబుతున్నప్పటికీ, వారి మధ్య ఎలాంటి లీజ్ అగ్రిమెంట్ లేదని ఆరోపించారు. ప్రస్తుతం సర్వే నంబర్ 301లో 3.02 ఎకరాల భూమి కేటీఆర్ సతీమణి శైలిమ పేరు మీద, 0.18 గుంటల భూమి ఆయన అత్త పాకాల శకిలేఖ పేరు మీద ఉందని స్పష్టం చేశారు.

భాజపా కేంద్ర నాయకత్వానికి సవాల్

ఈడీ అటాచ్ చేసిన కంపెనీకి చెందిన భూముల్లో ఈ 13 ఎకరాలు మ్యాజిక్‌మాదిరిగా ఎలా విడుదల అయ్యాయో, దానిపై ఐటీ శాఖ కోర్టుల్లో ఎందుకు సవాలు చేయలేదో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని చామల డిమాండ్ చేశారు.

స్పందన
తెలుగు దినపత్రిక

భారత చెస్ జట్ల 'హ్యాట్రిక్' విజయం

చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల, పురుషుల జట్లు వరుసగా మూడో విజయం నమోదు చేసి 'హ్యాట్రిక్' సాధించాయి. భారత మహిళల జట్టు 3.5–0.5తో గ్రీస్‌ను ఓడించింది. బోర్డు–1పై ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి 46 ఎత్తుల్లో స్టావ్‌రూలా సొలాకిడూపై గెలిచింది. బోర్డు–2పై దివ్యదేశ్‌ముఖ్, అనస్తాసియా అవ్రామిడూ గేమ్ 49 ఎత్తుల్లో 'డ్రా' అయింది.

బోర్డు–3పై వంతిక అగర్వాల్ 44 ఎత్తుల్లో ఎకతెరీని పావ్లిడూపై... బోర్డు–4పై సవితా శ్రీ 66 ఎత్తుల్లో అంటోనియా క్రిస్టోడులాకీపై గెలుపొందారు. భారత పురుషుల జట్టు 3–1తో ఇటలీపై నెగ్గింది. బోర్డు–1పై ప్రజ్ఞానంద, లొరెంజో లోడికి గేమ్ 41 ఎత్తుల్లో... బోర్డు–2పై ఇరిగేశి అర్జున్–లుకా మొరోని గేమ్ 64 ఎత్తుల్లో 'డ్రా' అయ్యాయి. బోర్డు–3పై నిహాల్ సరీన్ 40 ఎత్తుల్లో ఫ్రాన్సెస్కో సోనిస్‌పై... బోర్డు–4పై దొమ్మరాజు గుకేశ్ 33 ఎత్తుల్లో సబీనో బ్రునెల్లోపై గెలుపొందారు. నేడు జరిగే నాలుగో రౌండ్ మ్యాచ్‌ల్లో స్పెయిన్‌తో భారత పురుషుల జట్టు; మంగోలియాతో భారత మహిళల జట్టు తలపడతాయి.

నా కెరీర్‌లో అదే అత్యంత కఠిన నిర్ణయం: గౌతమ్ గంభీర్

స్వదేశంలో అఫ్గానిస్తాన్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను భారత జట్టు క్లీన్ స్వీప్ చేసింది. ఈ సిరీస్ అసాంతం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా ఆఖరి టీ20లో అయితే భారత బ్యాటర్లు చెలరేగిపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 30 బంతుల్లో శతక్కొట్టి, అంతర్జాతీయ టీ20ల్లో ఫాస్టెస్ట్ సెంచూరియన్‌గా నిలవగా.. సంజూ శాంసన్ హాఫ్ సెంచరీతో రాణించాడు. ఫలితంగా శ్రేయస్ సేన ప్రత్యర్థి ముందు 222 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచగల్గింది. అఫ్గాన్ ఈ కొండంత లక్ష్యాన్ని ఛేధించలేక 94 పరుగులకే కుప్పకూలింది. ఇక ఈ మ్యాచ్ అనంతరం భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తమ ఆటగాళ్లపై ప్రశంసల వర్షం కురిపించాడు. టీ-20ల్లో 300 పరుగులు సాధించడమే మా లక్ష్యమని గంభీర్ అన్నాడు.

"అఫ్గానిస్తాన్‌తో చివరి మ్యాచ్‌లో భారత జట్టుకు మెరుపు ఆరంభం దక్కింది. మరీ ముఖ్యంగా పవర్‌ప్లేలో మనవాళ్లు చాలా దూకుడుగా ఆడారు. ఆరు ఓవర్లలోనే జట్టు స్కోరు 100 పరుగుల మార్క్ దాటింది. నా కోచింగ్ కాలంలో ఇదే అత్యధికం. దూకుడుగా ఇన్నింగ్స్‌ను ఆరంభించినప్పుడు అదే జోరు కొనసాగిస్తే భారీ స్కోరు సాధ్యమే. టి20ల్లో ఇప్పటి వరకు మన జట్టు 300 మైలురాయిని అందుకోలేదు.

మా తదుపరి లక్ష్యం అదే. ఎందుకంటే డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ప్రతిభతో అదేం పెద్ద కష్టం కాదు. అభిషేక్ దూకుడు అందరికీ తెలిసిందే. అఫ్గాన్‌తో మూడో టి20లో అతడి సెంచరీ డ్రెస్సింగ్ రూమ్‌పై చాలా ప్రభావం చూపింది" అని గంభీర్ పేర్కొన్నాడు. కాగా సిరీస్‌లో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితం కావడంపై గంభీర్ స్పందించాడు. వైభవ్ సూర్యవంశీలో అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ, అతడు స్వదేశంలో అరంగేట్రం చేసేందుకు మరికొంత కాలం వేచి చూడక తప్పదని గంభీర్ వెల్లడించాడు.

ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ సందర్భంగా సంజూ సామ్సన్‌ను తుది జట్టు నుంచి తప్పించడం తన కెరీర్‌లోనే అత్యంత కఠిన నిర్ణయమన్న గంభీర్... వన్డే, టెస్టు సారథి శుబ్‌మన్ గిల్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని వివరించాడు.

ప్రారంభమైన ఆసియా గేమ్స్.. కిట్ ఆలస్యంతో మారిన భారత ఫ్లాగ్‌బేరర్

ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అయితే, ఈ ఆరంభ వేడుకల్లో భారతదేశ ఫ్లాగ్‌బేరర్ చివరి నిమిషంలో మారిపోయారు. ప్రముఖ కబడ్డీ ప్లేయర్ పవన్ సహ్రావత్‌ను పతాకధారిగా ఎంపిక చేశారు. తొలుత ఆ స్థానంలో షాట్‌పుటర్ తజిందర్‌పాల్ సింగ్ తూర్ ఎంపిక కాగా.. కిట్ ఆలస్యం కారణంగా పతాకధారిని మార్చాల్సి వచ్చింది. జెర్సీ సహా ఇతర క్రీడావస్తువులు ఉండే అధికారిక కిట్ తజిందర్‌కు ఇంకా అందకపోవడం వల్ల ఆసియా క్రీడల ప్రారంభోత్సవానికి అతడు హాజరుకాలేకపోయాడు. ఆరంభ వేడుకల్లో పవన్.. స్టార్ షూటర్ మనుబాకర్‌తో కలిసి భారత బృందానికి నాయకత్వంతో వహించారు. గత ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత పురుషుల కబడ్డీ జట్టులో 30 ఏళ్ల సహ్రావత్ సభ్యుడు.

అట్టహాసంగా ప్రారంభమైన ఆసియా క్రీడలు..

20వ ఆసియా క్రీడలు జపాన్‌లో నగోయా నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఈ క్రీడలు జరగనున్నాయి. 45 దేశాల క్రీడాకారులు ఈ గేమ్స్‌లో పాల్గొంటున్నారు. భారత్ నుంచి 30కిపైగా క్రీడల్లో 503 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2022లో చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో పతకాల పట్టికలో 28 బంగారు పతకాలతో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తంగా 106 మెడల్స్‌ను సొంతం చేసుకుంది.

డబ్ల్యూఏపీఎల్.. అమరావతి ఈ ఛాంపియన్స్‌దే విజయం

తొలిసారి జరుగుతోన్న మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్‌లో అమరావతి ఈ ఛాంపియన్స్ శుభారంభం చేసింది. తన మొదటి మ్యాచ్‌లోనే వైజాగ్ ఫైర్ బర్డ్స్‌పై 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గిన వైజాగ్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత అమరావతి ఈ ఛాంపియన్స్ బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఓపెనర్ రంగ లక్ష్మి (102) అద్భుతమైన శతకం సాధించింది. దీక్ష (43) రాణించింది. అనంతరం లక్ష్య ఛేదనలో వైజాగ్ 146/6 స్కోరుకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో పుష్పలత (60) హాఫ్ సెంచరీ నమోదు చేసింది. అయేషా సింగ్ (35*), శర్వాణి (24) ఫర్వాలేదనిపించారు. అమరావతి బౌలర్లలో దేవిక 2.. విష్ణుప్రియ, తరిణి జోషి, పూజిత తలో వికెట్ తీశారు.

రంగ లక్ష్మి అరుదైన ఘనత

మహిళల ఆంధ్రా ప్రిమియర్ లీగ్‌లో రంగ లక్ష్మి (Ranga Lakshmi) అరుదైన ఘనత సాధించింది. ఈ లీగ్‌లో తొలి సెంచరీ చేసిన బ్యాటర్‌గా రంగ లక్ష్మి నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకుంది. ఓ వైపు కెప్టెన్ నీరగట్టు అనూష (10) త్వరగానే పెవిలియన్‌కు చేరినా మరో ఎండ్‌లో రంగ లక్ష్మి మాత్రం పట్టు వదల్లేదు. బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో 71 బంతుల్లో శతకం పూర్తి చేసింది. దీక్షతో కలిసి రెండో వికెట్‌కు 90 పరుగులు జోడించింది. అయితే, స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ పెవిలియన్‌కు చేరడంతో ఆఖర్లో స్కోరు బోర్డు వేగం తగ్గింది. వైజాగ్ బౌలర్లలో శర్వాణి, రిషిక, శరణ్య తలో వికెట్ తీశారు.

అంతకుముందు తొలి మ్యాచ్‌లో..

డబ్ల్యూఏపీఎల్ తొలి మ్యాచ్ గోదావరి గోల్డెన్ ఈగల్స్ రాయలసీమ జెన్ స్టార్స్ మధ్య జరిగింది. గోదావరిపై రాయలసీమ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గోదావరి జట్టు 116 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన రాయలసీమ టీమ్ 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి టార్గెట్‌ను ఛేధించింది. శుభ శ్రీ 23, సేతు సాయి 33, పద్మజ 30* రన్స్ చేశారు. గోదావరి బౌలర్లలో హారిక, పెరైరా, విన్నీ సుజన్ తలో వికెట్ తీశారు.

సెమీస్‌లో ఓటమి.. అయినా మరో అవకాశం!

ఆసియా క్రీడలు 2026లో భారత టెక్‌బాల్ స్టార్ క్వీమ్సీ డిసౌజాకు చేదు అనుభవం ఎదురైంది.

మహిళల సింగిల్స్‌లో ఆది నుంచి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈ ముంబైకర్ సెమీ ఫైనల్లో మాత్రం ఓటమిపాలైంది. ఇండోనేషియాకు చెందిన ఇమా సుమయతో సెమీస్‌లో తలపడ్డ క్వీమ్సీ తొలి సెట్‌ను 127తో గెలుచుకుంది. అయితే, సుమయ అనూహ్య రీతిలో పుంజుకుని రెండో సెట్‌ను 129తో సొంతం చేసుకుంది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో పట్టువదలని సుమయ 127తో క్వీమ్సీపై పైచేయి సాధించింది.

ఫలితంగా సుమయా ఫైనల్‌కు అర్హత సాధించింది. అయితే, సెమీస్‌లో ఓడినప్పటికీ క్వీమ్సీకి పతకం గెలిచేందుకు మరో అవకాశం ఉంది. ఆదివారం జరిగే కాంస్య పతక పోరులో ఆమె జపాన్‌కు చెందిన యియునా సకామొటోతో అమీతుమీ తేల్చుకుంటుంది. ఎవరీ క్వీమ్సీ డిసౌజా?ముంబైకి చెందిన క్వీమ్సీ పదమూడేళ్ల వయసులో మిడిల్ డిస్టాన్స్ రన్నర్‌గా తన క్రీడా ప్రయాణం మొదలుపెట్టింది. ఆ తర్వాత ఫుట్‌బాల్‌పై మక్కువ పెంచుకున్న 24 ఏళ్ల ఈ అమ్మాయి ఏజ్ గ్రూప్‌లో మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించింది.

అయితే, ఆశించిన రీతిలో కెరీర్ కొనసాగే పరిస్థితి లేకపోవడంతో క్వీమ్సీ.. చదువు మీద శ్రద్ధ పెట్టింది. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేసి.. క్రీడా వస్తువుల రీటైలర్ డెకథ్లాన్‌లో ఉద్యోగంలో చేరింది. అక్కడే ఆమెకు టెక్‌బాల్ పరిచయమైంది. బ్రెజిల్ ఫుట్‌బాల్ దిగ్గజం రినాల్డిన్హో ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో టెక్‌బాల్ ఆటను వీక్షించిన క్వీమ్సీకి ఆసక్తి పెరిగింది. ఈ క్రమంలో కఠోర శ్రమతో క్రమక్రమంగా భారత టెక్‌బాల్ స్టార్‌గా ఎదిగింది. అంతర్జాతీయ స్థాయిలో టెక్‌బాల్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి మహిళా టెకర్‌గా నిలిచింది. ఏడుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన క్వీమ్సీ.. బెంగళూరులో టెక్‌బాల్ క్లబ్ స్థాపించి.. క్రీడను ప్రోత్సహిస్తోంది. ఇటీవల రొమేనియాలో జరిగిన టెక్‌బాల్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో క్వీమ్సీ తొమ్మిదో స్థానంలో నిలిచింది.

ఇక తాజాగా ఆసియా క్రీడల్లో మహిళల సింగిల్స్‌లో గ్రూప్‌ఎ నుంచి తలపడ్డ క్వీమ్సీ.. తొలుత జపాన్ టెకర్ యియునా సకామొటోపై 21తో గెలిచింది. ఆ తర్వాత కాంబోడియా టెకర్ కొయెమైయన్‌ను ఓడించింది. ఈ క్రమంలో గ్రూప్ఎ టాపర్‌గా నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. అయితే, సెమీస్‌లో మాత్రం ఓటమి ఎదురైనప్పటికీ.. కాంస్య పతక పోరులో నిలవగలిగింది.

ఏమిటీ టెక్‌బాల్?ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌ల కలయికే ఈ గేమ్. వాలుగా ఉన్న టేబుల్ పైనున్న నెట్ మీదుగా.. ఆటగాళ్లు తమ పాదాలు, కాళ్లు, ఛాతీ, తలతో ఫుట్‌బాల్‌ను కొడుతుంటారు. చేతులు, భుజాలు కాకుండా శరీరంలోని ఏ భాగంతోనైనా ఫుట్‌బాల్‌ను హిట్ చేయొచ్చు. సింగిల్స్, డబుల్స్ ఫార్మాట్లలో దీనిని నిర్వహిస్తారు. హంగేరీలో 2014లో ఈ క్రీడను కనుగొన్నారు.

'రామాయణ' ఇంగ్లిష్ వెర్షన్ నిడివిలో మార్పు

రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి జంటగా నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'. ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఇంగ్లిష్ వెర్షన్‌కు సంబంధించి ప్రస్తుతం నెట్టింట ఓ చర్చ జరుగుతోంది. హిందీ వెర్షన్‌తో పోలిస్తే ఇంగ్లిష్ వెర్షన్ నిడివి దాదాపు 30 నిమిషాలు తక్కువగా ఉండనుందని టాక్. విదేశీ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఇంగ్లిష్ వెర్షన్‌లో పలు మార్పులు చేశారట. అక్కడ విడుదలయ్యే చిత్రంలో అసలు పాటలే ఉండవని తెలుస్తోంది. అలాగే కొన్ని సన్నివేశాలకు కూడా కత్తెర వేసినట్లు సమాచారం. సాధారణంగా భారతీయ ప్రేక్షకులు మూడు గంటలకు పైగా నిడివి ఉన్న సినిమాలను, మధ్యలో వచ్చే పాటలను ఆదరిస్తారు. కానీ, అంతర్జాతీయ ప్రేక్షకులకు ఆ శైలి అంతగా నచ్చకపోవచ్చనే ఉద్దేశంతోనే నిర్మాతలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇటీవలే వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రంలోని తొలి పాట 'జయ జయ రామ్' విడుదలై విశేషంగా ఆకట్టుకుంది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ పాటను అర్జిత్ సింగ్, శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. నమిత్ మల్హోత్రా, యశ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ దీపావళికి 'రామాయణ-పార్ట్ 1' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

కోలీవుడ్‌లోకి కేతిక శర్మ..

టాలీవుడ్‌లో వరుస చిత్రాలతో ప్రేక్షకులను పలకరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయిన అందాల భామ కేతిక శర్మ. 'రొమాంటిక్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆ తర్వాత 'లక్ష్య', 'రంగరంగ వైభవంగా', 'బ్రో' వంటి పలు సినిమాల్లో నటించి గ్లామర్‌తో మెప్పించారు. అయితే బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆమెకు సరైన హిట్ దక్కలేదు. దీంతో టాలీవుడ్‌లో కొద్దిగా విరామం తీసుకున్న ఈ సుందరి, ఇప్పుడు తన అదృష్టాన్ని కోలీవుడ్‌లో పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 'మీసయ్య మురుక్కు-2' సినిమాతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. టాలెంటెడ్ ఆర్టిస్ట్ ఆది నటిస్తూ స్వయంగా డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో కేతిక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. గతంలో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ సినిమాకు ఇది సీక్వెల్‌గా వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతుండగా, కేతిక తాజాగా మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తమిళంలో తనకు ఇదే మొదటి సినిమా అని చెబుతూ కేతిక తన ఆనందాన్ని పంచుకున్నారు. తనకు తమిళం కొంతవరకు అర్థమైనా, మాట్లాడటం మాత్రం పూర్తిగా రాదని తెలిపారు. అయితే ఆ భాషపై పట్టు సాధించేందుకు తాను ఏకంగా నెల రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తాను తమిళ తరగతులకు హాజరవుతున్నానని, ఈ లెర్నింగ్ ప్రాసెస్ తనకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తోందని చెప్పారు. తమిళనాడు ప్రజల ఆదరణ గురించి మాట్లాడుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. అక్కడి ప్రజలంటే తనకు చాలా ఇష్టమని, తాను చెన్నైకి వెళ్లిన ప్రతీసారి అక్కడి ప్రేక్షకులు, కోలీవుడ్ నటీనటులు తనకు ఇచ్చిన స్వాగతం మరువలేనిదని తెలిపారు. అక్కడ తనకు కేవలం అపారమైన ప్రేమ, ఆప్యాయత మాత్రమే దొరికాయని, అందుకు తాను ఎంతో కృతజ్ఞురాలినని చెప్పారు. తమిళ పరిశ్రమతో తన మనసు పూర్తిగా మమేకమైపోయిందని, ఇక్కడి వాతావరణం చూస్తుంటే తన సొంత ఇంట్లో ఉన్నట్లే ఉంటుందని కేతిక చెప్పుకొచ్చారు.

థ్రిల్ పంచే.. తుడక్కమ్

రివ్యూ

మోహన్‌లాల్ తనయ విస్మయ వెండితెరకు పరిచయమవుతూ కీలక పాత్రలో నటించిన చిత్రం 'తుడక్కమ్'. మీనూ (విస్మయ మోహన్‌లాల్) తల్లి చిన్నప్పుడే చనిపోవడంతో తండ్రి రవి బాల చంద్రన్ (సాయికుమార్) అన్నీ తానై పెంచుతాడు. తనకు కాళ్లు లేకపోయినా కుమార్తెకు అండగా నిలబడతాడు. మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ ఇప్పిస్తాడు. ఒకవైపు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే.. మరోవైపు అదే ఊళ్లో చిన్న పిల్లలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తూ ఉంటుంది మీనూ. వీఆర్‌వోగా పనిచేస్తున్న తండ్రి రవిని ఓ స్థలానికి సంబంధించి అనుమతులు ఇవ్వాలని కొందరు బెదిరిస్తుంటారు. ఒకరోజు కాంపిటేటివ్ ఎగ్జామ్ రాయడానికి స్నేహితురాలు ప్రియతో కలిసి వెళ్లిన మీనూ మిస్సవుతుంది. దీంతో తండ్రి రవి పోలీసులను ఆశ్రయిస్తాడు. అంతా కలిసి మీనూను వెతకడానికి బయలుదేరతారు. మరి మీనూ ఏమైంది? ఎలా మిస్సయింది? పోలీసుల కనిపెట్టారా? ఆమెకు ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ఎలా ఉందంటే..

సినీ వారసులు వెండితెరకు పరిచయమవుతున్నారంటే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. పైగా మోహన్‌లాల్ వంటి విలక్షణ నటుడి కుటుంబం నుంచి వస్తుండటంతో అంచనాలు ఉంటాయి. అందుకు తగినట్లే ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలతో పాటు, సందేశాన్ని మేళవించి తీర్చిదిద్దిన చిత్రమే 'తుడక్కమ్'. '2018' బ్లాక్‌బస్టర్ మూవీని తీసిన జుడే ఆంథోని జోసెఫ్ 'సర్వైవల్ థ్రిల్లర్'గా తాజా చిత్రాన్ని తీర్చిదిద్దడంలో చాలా వరకూ విజయం సాధించారు. అయితే, కథావస్తువు చాలా చిన్నది కావడం, అనవసర పాటలు, మలయాళ చిత్రాల్లో నెమ్మదిగా సాగే కథాగమనం వంటికి ఈ సినిమాకు స్పీడ్ బ్రేకర్స్‌లా మారడంతో మరింత థ్రిల్ పంచాల్సిన మూవీ ఓకే అనిపిస్తుంది. మీనూ, ఆమె తండ్రి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పరిచయం చేస్తూ కథను ఆరంభించిన దర్శకుడు మెయిన్ పాయింట్‌కు రావడానికి చాలా సమయం తీసుకున్నాడు. బహుశా విస్మయ మొదటి చిత్రం కావడంతో ప్రేక్షకుడు ఆమె నటనను స్వీకరించడానికి సమయం తీసుకుని ఉంటాడు. ఎప్పుడైతే మీనూ ఫోన్ స్విచ్ఛాఫ్ అయి, అందుబాటులో లేకుండా పోతుందో అప్పటి నుంచి కథలో ఉత్కంఠ మొదలవుతుంది. ఇక్కడి నుంచి సాగే పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆద్యంతం ఆసక్తికరంగానే ఉంటుంది. ఇటువైపు పోలీసు ఇన్వెస్టిగేషన్ చూపిస్తూనే సమాంతరంగా మీనూకు ఏమైందో చెబుతూ కథగమనాన్ని నడిపించిన తీరు ప్రేక్షకుడికి అరటిపండు వలిచి పెట్టినట్లు అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం చేశారు. విరామ సమయానికి మీనూని ఇంటికి చేర్చి, ఊహించని ఓ ట్విస్ట్ ఇస్తాడు దర్శకుడు. అక్కడి నుంచి కథ, కథనాలు రివెంజ్ డ్రామాగా మారుతాయి. 'నిజం పెదవి దాటేలోపు.. అబద్ధం ప్రపంచమంతా చుట్టి వస్తుంది' అన్నట్లు మీనూకి ఎదురైన పరిస్థితులను చుట్టు పక్కల వాళ్లు చూసే కోణం, సామాజిక మాధ్యమాల్లో జరిగే చర్చ నేటి పరిస్థితులకు చక్కగా అద్దం పడుతుంది. మహిళల విషయంలో జరిగే చిన్నతప్పును కూడా బయట ఎలా ప్రచారం చేస్తారన్న అంశాలను బాగా చూపించారు. ఇక్కడ మోహన్‌లాల్‌ను తీసుకొచ్చి, సందేశం ఇచ్చే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ముఖ్యంగా మహిళలు తమ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించి నిలబడినప్పుడే ముందుకెళ్లగలరన్న ధైర్యాన్ని నింపుతూ సాగే ఆయా సన్నివేశాలు. యాక్షన్ ఎపిసోడ్ అలరిస్తాయి. పతాక సన్నివేశాల్లో విస్మయ యాక్షన్, తనను అంతం చేయడానికి వచ్చిన వారిని కట్టడి చేసే సన్నివేశాలు థ్రిల్ పంచుతాయి. ముఖ్యంగా ఇటీవల వచ్చిన 'బ్లాస్ట్' ఛాయలు కనిపించినా, మహిళా సాధికారత ప్రధాన ఇతివృత్తంగా ఆయా సన్నివేశాలను తీర్చిదిద్దిన విధానం బాగుంది.

విజయ్‌తో నటించడం అదృష్టంగా భావిస్తున్నా: మమితా బైజు

యూత్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న ఈ మలయాళ బ్యూటీ మమిత బైజు, దళపతి విజయ్ కాంబోలో వచ్చిన మూవీ 'జననాయగన్'. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 300 కోట్లకు పైగా వసూళ్లను సాధించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఈ భారీ చిత్రంలో విజయ్ కూతురిగా నటించిన మమిత, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నటనతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మమిత బైజు.. కోలీవుడ్ తలపతి విజయ్‌తో కలిసి పనిచేసిన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాలో భాగం కావడం తన అదృష్టమని, ఎందుకంటే తాను మొదటి నుంచి విజయ్‌కి వీరాభిమానినని ఆమె మనసులోని మాట బయటపెట్టారు. సినిమా విడుదలైన తర్వాత కూడా తాము పలుమార్లు ఫోన్ ద్వారా మాట్లాడుకున్నామని, ఆ సందర్భంగా తాను ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసినట్లు మమిత తెలిపారు. షూటింగ్ సెట్‌లో విజయ్ ప్రవర్తన గురించి చెబుతూ ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అంత పెద్ద సూపర్ స్టార్ అయినప్పటికీ, ఆయనలో గర్వం అస్సలు ఉండదని.. సెట్‌లో అందరితోనూ చాలా ఆప్యాయంగా, స్నేహపూర్వకంగా మెలిగేవారని చెప్పారు. ముఖ్యంగా తనతో మాట్లాడేటప్పుడు ఆయన ఒక సీనియర్ హీరోలా కాకుండా, తన వయసు వారితో లేదా ఒక మంచి స్నేహితురాలితో మాట్లాడినట్లుగా ఎంతో సాధారణంగా ఉండేవారని ఆమె గుర్తుచేసుకున్నారు. దాంతో ఆయనతో కలిసి పనిచేస్తున్నంత సేపు తనకు ఏమాత్రం టెన్షన్ కలగలేదని, ఎంతో కంఫర్టబుల్‌గా అనిపించిందని వెల్లడించారు. ఎవరైనా సరే విజయ్‌ను చాలా సులభంగా కలవవచ్చని, ఆయన సాదాసీదా స్వభావం తనను ఎంతగానో ఆకట్టుకుందని మమిత ప్రశంసించారు. అంతటి మహానటుడిని కలవడం, ఆయనతో కలిసి నటించే అరుదైన అవకాశం దక్కడం తన సినీ కెరీర్‌లోనే అత్యుత్తమ క్షణాలని మమిత బైజు ఆనందంగా పంచుకున్నారు.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780